క్లుప్తంగా

ఆలయాభివృద్ధికి కృషి



ముదినేపల్లి రూరల్: ప్రసిద్ధి చెందిన సింగరాయపాలెం–చేవూరుపాలెం సెంటర్‌లోని శ్రీసుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయాభివృద్ధికి కృషి చేయాలని వైఎస్సార్ సీపీ నాయకులు కోరారు. ఇటీవలే ఆలయానికి సహాయ కమిషనర్‌గా బదిలీపై వచ్చిన ఆర్.గంగాశ్రీదేవిని మండలంలోని వైఎస్సార్ సీపీ నాయకులు మంగళవారం కలిసి మాట్లాడారు. భక్తుల మనోభావాలకు అనుగుణంగా ఆలయాన్ని తీర్చిదిద్దేందుకు సాయిశక్తులా కృషి చేస్తానని ఈ సందర్భంగా నాయకులకు సహాయ కమిషనర్ హామీ ఇచ్చారు. నాయకులు రంగిసెట్టి కొండా, ఆనందదాసు శివనాగేంద్ర, బాబ్జి, శివయ్య సహాయ కమిషనర్‌ను కలిసిన వారిలో ఉన్నారు.

చట్టాలపై అవగాహన

కైకలూరు: పంచాయతీ చట్టాలపై వార్డు సభ్యులకు అవగాహన ఉండాలని రిసోర్సు పర్సన్లు శివన్నారాయణ, కిరణ్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్ పంచాయతీరాజ్ (ఏపీఎస్ఐఆర్‌డీపీఆర్) ఆధ్వర్యంలో ఉప సర్పంచ్‌లు, వార్డు సభ్యులకు మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. బుధ, గురువారాల వరకు శిక్షణ ఉంటుందని తెలిపారు.

నాయీ బ్రాహ్మణులకు కమ్యూనిటీ భవనం నిర్మించాలి



కైకలూరు: నాయీ బ్రాహ్మణులకు కమ్యూనిటీ భవనం నిర్మించాలని కైకలూరు నియోజకవర్గ సంఘ అధ్యక్షుడు కొత్తపల్లి విజయ్ కుమార్ కోరారు. స్థానిక వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆవరణలో మండల స్థాయి సంఘ సమావేశం మంగళవారం నిర్వహించారు. కేంద్రం నాయీ బ్రాహ్మణులకు అందిస్తున్న విశ్వకర్మ యవజన పథకంపై చర్చించారు. ఈ పథకంలో నమోదు చేసుకున్న వారికి రూ.15,000 విలువ చేసే కిట్‌ను అందిస్తారు. దీనిపై శిక్షణ తాడేపల్లిగూడెంలో అందిస్తామని చెప్పారు. ఆ సంఘ మండల అధ్యక్షుడు మాటూరి వెంకటేశ్వరరావు, నాయకులు శేషు, సత్యనారాయణ, రమేష్, సత్యారావు పాల్గొన్నారు.

పాడి రైతులకు బోనస్ పంపిణీ



పామర్రు: పాల కేంద్రంలోని 315 మంది పాడి రైతులకు రూ.1,79,333ను బోనస్‌గా మంగళవారం ఆ కేంద్రం అధ్యక్షుడు బొమ్మారెడ్డి కృష్ణారెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2023–24 ఆర్థిక సంవత్సరంలో వచ్చిన లాభాలను సొసైటీ బోనస్‌గా అందజేస్తున్నామని తెలిపారు. అధికంగా పాలు పోసిన తేళ్ల అంజిరెడ్డి రూ.6,776 సాధించి ప్రథమ స్థానంలో ఉండగా డి.కృష్ణంరాజు రూ.4,756 సాధించి ద్వితీయ స్థానంలో ఉన్నారని పేర్కొన్నారు. కేంద్రం వేతన కార్యదర్శి ఆరేపల్లి శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

అలంకార బ్రహ్మ



పూబంతులపై శయనించిన అపరచండీకి అలంకణ చేస్తున్న గౌతమేశ్వరరావు (ఫైల్)

జిల్లాలో దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా పలు ఆలయాల్లో వివిధ దేవతా రూపాల్లో దర్శనమిచ్చే అమ్మవార్లను అలంకరించడమే ప్రధానం. అలాంటి అమ్మవార్ల అలంకరణలో అంబా గౌతమేశ్వరరావు ఎంతో నైపుణ్యం సాధించారు. దివి నుంచి భువికి అమ్మవారే దిగి వచ్చారా అన్నట్లుగా తీర్చిదిద్దుతూ భక్తుల మన్ననలు పొందుతున్నారు.

దేవతామూర్తులను తీర్చిదిద్దుతున్న గౌతమేశ్వరరావు

గుడ్లవల్లేరు: బ్రహ్మలోకంలో బొమ్మలను చేసేది ఆ బ్రహ్మ అయితే.. దసరా వచ్చిందంటే దేవతా రూపాలను అలంకరించి సృష్టించే ఈ అలంకార బ్రహ్మ గుడ్లవల్లేరు మండలం కౌతవరానికి చెందిన అంబా గౌతమేశ్వరరావు. జిల్లాలో దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లోని పలు ఆలయాల్లో వివిధ దేవతా రూపాల్లో దర్శనమిచ్చే అమ్మవార్లను అలంకరించేందుకు ఎంతో నైపుణ్యం ఉండాలి. తొమ్మిది రోజుల పాటు వేర్వేరు అవతారాల్లో భక్తులను ఆకట్టుకునే అమ్మవార్ల నగల నుంచి.. చీరల వరకు ఎంపిక చేసి అలంకరించే కళాకారులను అపర బ్రహ్మలుగా చెప్పటంలో ఏ మాత్రం అతిశయోక్తి కాదు. గౌతమేశ్వరరావు కౌతవరం గౌతమేశ్వరాలయంలో వేద పండితుడు.

నామకరణాలకు ప్రతిరూపంగా అలంకారం

42 ఏళ్లగా దసరా నవరాత్రులకు ఆలయాల్లో అమ్మవారి రూపాలను ఆ దేవతా నామకరణాలకు ప్రతిరూపంగా గౌతమేశ్వరరావు అలంకరిస్తున్నారు. విన్నకోటలో శ్రీ భోగేశ్వరస్వామి ఆలయం, జిల్లాలో ప్రఖ్యాతిగాంచిన శ్రీ కొండలమ్మ తల్లి అమ్మవారి ఆలయం, వందలేళ్ల చరిత్ర కలిగిన కౌతవరం శ్రీ గౌతమేశ్వరాలయం, ముదినేపల్లి మండలం గురజలో శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయం, గుడ్లవల్లేరు శ్రీ కన్యకాపరమేశ్వరీ దేవి పంచాయన క్షేత్రంలోని అమ్మవార్లకు ఉదయం భక్తులు దర్శించుకునే సమయానికి అవతారాలను అలంకరిస్తారు. దేవతా స్వరూపాలకు చేసే అలంకరణలు నచ్చి జిల్లాలో వివిధ ఆలయాలకు రావాలంటూ పిలుపు వస్తున్నా రాత్రి సమయంలో అన్ని ఆలయాలకు తిరగాలంటే సాధ్యమయ్యే పని కాదని ఆయన చెబుతున్నారు. అమ్మవార్లకు చేసే అలంకరణలు మెచ్చిన వారంతా 'అలంకార సామ్రాట్ అనే బిరుదును కూడా ఇచ్చారు' అని గౌతమేశ్వరరావు తెలిపారు.



శ్రీ కనకదుర్గాదేవిని అలంకరించిన గౌతమేశ్వరరావు (ఫైల్)

అమ్మవారే దిగి వచ్చినట్లుగా



దివి నుంచి భువికి అమ్మవారే దిగి వచ్చారా అన్నట్లుగా అంబా గౌతమేశ్వరరావు దేవీ అలంకారాలను చేయటంలో దిట్ట. అమ్మవారిని ఏ అవతారంలో అలంకరించినా ఆ దేవతే వచ్చి గుళ్లో కూర్చొన్నట్లుగా తీర్చి దిద్దటం ఆయనకే చెల్లింది అనటంలో ఏ మాత్రం అతిశయోక్తి కాదు.

– ఆకుల కొండలరావు, కొండలమ్మ ఆలయం ఈఓ

దశాబ్దాలుగా అలంకరణ



దశాబ్దాలుగా అమ్మవారి అలంకారాలను గౌతమేశ్వరరావు చేస్తున్నారు. అలంకారాల విషయంలో ఆయన కోసం జిల్లాలో ఎన్నో ఆలయాల నుంచి డిమాండ్ ఉంది. సమయం చాలక ఆయన కొద్ది ఆలయాలకే ప్రాధాన్యం ఇచ్చి అలంకరణ చేస్తున్నారు. ఆయనకు అలంకార సామ్రాట్ అనే బిరుదును కూడా ఇచ్చారు.

– రుద్రపాక శరశ్చంద్ర శివ సంతోష్ శర్మ, వేద పండితుడు

డీఎన్నార్ దంపతుల ప్రత్యేక పూజలు



కైకలూరు: దసరా మహోత్సవాల సందర్భంగా వైఎస్సార్ సీపీ ఏలూరు జిల్లా అధ్యక్షుడు దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) దంపతులు వివిధ ఆలయాల్లో మంగళవారం పూజలు చేశారు. కైకలూరు షిరిడీ సాయిబాబా మందిరం, వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయం, కలిదిండి మండలం కోరుకొల్లులో రాజరాజేశ్వరి అమ్మవారి దేవాలయంలో ధనలక్ష్మీదేవీ అలంకరణలో అమ్మవారిని దర్శించుకున్నారు. కార్యక్రమాల్లో చన్నంశెట్టి నాగరాజు, అంకెం నరసయ్య, సోమేశ్వరరావు, వీరుళ్ల, లక్ష్మణరావు, శ్రీనివాసరావు, ముసలయ్య, తదితరులు తదితరులు పాల్గొన్నారు.

అనుబంధ రంగాలతో అదనపు ఆదాయం

ముదినేపల్లి రూరల్: వ్యవసాయ అనుబంధ రంగాలతో రైతులు అదనపు ఆదాయం పొందొచ్చని జిల్లా వ్యవసాయాధికారి షేక్ హబీబ్ బాషా అన్నారు. మండలంలోని కొరగుంటపాలెం, పెదగొన్నూరు గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన రైతులతో మాట్లాడుతూ వ్యవసాయ అనుబంధ రంగాల్లో వస్తున్న ఆధునిక సాంకేతిక పద్ధతులను అవలంబిస్తూ అధిక ఆదాయాన్ని పొందాలన్నారు. ఇందు కోసం మట్టి నమూనాల పరీక్షలను చేయించి, ఫలితాలకు అనుగుణంగా ఎరువులు వాడుకోవాలన్నారు. మండవల్లి సబ్ డివిజన్ ఏడీఏ జి.వెంకటమణి మాట్లాడుతూ మండలంలో గత సీజన్‌లో 950 మట్టి నమూనాలను సేకరించి, రైతులకు భూసార పరీక్ష కాపీలు అందజేశామన్నారు. మండల వ్యవసాయాధికారి బి.వేణుమాధవ్, మండల ఫిషరీస్ ఇన్‌స్పెక్టర్ సతీష్‌కుమార్, ప్రకృతి వ్యవసాయ ఇన్‌చార్జి గౌతమ్‌కుమార్ రైతులకు అవగాహన కల్పించారు.కొరగుంటపాలెం సర్పంచ్ రామకృష్ణ, పెదగొన్నూరు సర్పంచ్ శిరీష తదితరులు పాల్గొన్నారు.



కొరగుంటపాలెంలో రైతులతో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి హబీబ్ బాషా

అంబేడ్కర్ భవనానికి స్థలం కేటాయించండి

కైకలూరు: అంబేడ్కర్ భవన నిర్మాణానికి ముదినేపల్లి అంబేడ్కర్ నగర్ వద్ద రీ సర్వే నంబర్ 178/1 ఖాళీ స్థలాన్ని కేటాయించాలని ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్‌కు మంగళవారం ముదినేపల్లి మండల ఎస్సీ నాయకులు వినతిపత్రం అందించారు. ముదినేపల్లి పంచాయతీ బోర్డు తీర్మానం, రెవెన్యూ నుంచి పొజిషన్ సర్టిఫికెట్, భవన నిర్మాణానికి అనుమతులు మంజూరు చేయాలని కోరారు. ఏపీ టూరిజం కార్పొరేషన్ డైరెక్టర్ కొడాలి వినోద్, మాల మహానాడు అనుబంధ సంఘాల అధ్యక్షుడు సేవా నాగజగస్ బాబబూరావు తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే కామినేనికి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు



సింగరాయపాలెం అమతేశ్వరస్వామి ఆలయంలో మహాలక్ష్మీదేవిగా..



తటివర్రురోడ్డులో శ్రీగాయిత్రీదేవిగా అమ్మవారు



పామర్రులో ధనలక్ష్మీ అలంకారంలో పర్వతవర్ధనీ దేవి



గుడివాడ కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో ధనలక్ష్మీదేవిగా..



కూచిపూడిలో శ్రీ మహాలక్ష్మీదేవిగా దర్శనమిచ్చిన బాలమ్మ



గజలక్ష్మీ దేవిగా దర్శనమిచ్చిన కొండలమ్మ



తోట్లవల్లూరులో శ్రీమహాలక్ష్మీ దేవిగా అమ్మవారు

మహాలక్ష్మీ నమోస్తుతే..

శరన్నవరాత్రి మహోత్సవాలు జిల్లాలోని ఆలయాల్లో ఘనంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా అమ్మవారిని మంగళవారం మహాలక్ష్మీదేవిగా, లలితాత్రిపుర సుందరీదేవీగా అలంకరించి, పూజలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో అమ్మవార్లను దర్శించుకున్నారు.

ముదినేపల్లి రూరల్: మండలంలోని సింగరాయపాలెం శ్రీఅమతేశ్వరస్వామి ఆలయంలో అర్చకుడు రుద్రపాక ప్రసాద్ అమ్మవారిని మంగళవారం మహాలక్ష్మీదేవిగా అలంకరించారు. ఆలయ ఈఓ శింగనపల్లి శ్రీనివాసరావు పర్యవేక్షించారు. దేవపూడి విజయదుర్గాంబ, పెయ్యేరు కనకదుర్గ ఆలయాల్లో లలితాత్రిపుర సుందరీదేవిగా దర్శనమిచ్చారు.

తోట్లవల్లూరులో..

తోట్లవల్లూరు: స్థానిక శ్రీభ్రమరాంబ చెన్నమల్లికార్జున స్వామి ఆలయంలో ఉత్సవాల ఆరో రోజైన మంగళవారం అమ్మవారు శ్రీమహాలక్ష్మీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు.

గాయత్రీదేవీ రక్షమాం

కైకలూరు: కైకలూరు శ్యామలాంబను మంగళవారం గాయత్రీదేవిగా అలంకరించారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా కోదండ రామ మురళీ కోలాటం, శివ గానామృతం, కూచిపూడి నృత్యప్రదర్శన ఆకట్టుకున్నాయి. కొల్లేటికోట పెద్దింట్లమ్మ దేవస్థానంలో అమ్మవారికి నవ కలశపూజ, లలితా సహస్రనామ కుంకుమ పూజను కైకలూరుకు చెందిన కొత్తపల్లి నాగ ధారలక్ష్మీ తేజావర్మ, లక్ష్మీప్రసన్న దంపతులు చేశారు. లోకమూడి దత్తాశ్రమంలో గాయత్రీదేవీ అలంకరణ ఆకట్టుకుంది. కల్వకొలను శివప్రసాద్ దంపతులు పూజలు చేశారు.

గుడివాడలో..

గుడివాడ టౌన్: స్థానిక వాసవీచౌక్ లోని కన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవస్థానం, కొత్తపేటలోని విజయదుర్గ అమ్మవారి దేవస్థానంలో అమ్మవార్లను శ్రీ ధనలక్ష్మీదేవిగా అలంకరించారు. భీమేశ్వరస్వామి దేవస్థానంలో శ్రీ గాయత్రీదేవిగా, గౌరీశంకరస్వామి దేవస్థానం, నీలామహల్‌రోడ్డులోని విజయదుర్గ దేవస్థానాల్లో అమ్మవార్లను శ్రీ మహాలక్ష్మీదేవిగా అలంకరించి భక్తుల దర్శనానికి ఉంచారు.

శ్రీ గజలక్ష్మీదేవిగా కొండలమ్మ

గుడ్లవల్లేరు: వేమవరం శ్రీ కొండలమ్మ తల్లి అమ్మవారు శ్రీ గజలక్ష్మీదేవిగా మంగళవారం భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ఈఓ ఆకుల కొండలరావు ఆధ్వర్యంలో ఆలయ పండితుల వేద మంత్రోచ్ఛరణ నడుమ వివిధ పూజలు, విశేషాభిషేకాలతో పాటు ప్రత్యేక హోమాలను చేపట్టారు. డోకిపర్రు భూ సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో అమ్మవారు శ్రీ విజయలక్ష్మీ దేవిగా దర్శనమిచ్చారు.

పామర్రులో..

పామర్రు: స్థానిక రామలింగేశ్వరస్వామి సమేత పర్వతవర్ధనీదేవి, వాసవీ కన్యకాపరమేశ్వరీ ఆలయంలో అమ్మవార్లను ధనలక్ష్మీదేవిగా అలంకరించి చారు. అంకమ్మ ఆలయంలో మహాలక్ష్మీదేవిగా అలంకరించారు. సోమేశ్వరస్వామి ఆలయంలో పార్వతీ అమ్మవారు మంగళగౌరీ దేవిగా దర్శనమిచ్చారు. కొండిపర్రు గ్రామంలోని భ్రమరాంబదేవిని మంగళగౌరిగా అలంకరించి పూజలు నిర్వహించారు.

తటివర్రురోడ్డులో..

గుడివాడరూరల్: తటివర్రురోడ్డులో ఏర్పాటు చేసిన ఉత్సవాల్లో అమ్మవారు శ్రీగాయత్రీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. చిన ఎరుకపాడులో వేంసియున్న శ్రీఅష్టలక్ష్మీ దేవస్థానంలో అమ్మవారు సంతానలక్ష్మీదేవిగా దర్శనమిచ్చారు.

నందివాడలో..


నందివాడ: మండలంలోని లక్ష్మీనరసింహపురంలో ధనలక్ష్మీదేవి అవతారంలో అమ్మవారు దర్శనమిచ్చారు. అనంతరం నిర్వహించిన కుంకుమార్చన పూజలో ఎస్ఎంటీ స్కూల్ చైర్మన్ చినరాయుడు, గురుభవాని సత్యనారాయణ పాల్గొన్నారు.

కూచిపూడిలో..

కూచిపూడి(మొవ్వ): కూచిపూడి నాట్యాచార్యుల ఇలవేల్పు శ్రీ బాలా త్రిపురసుందరీ అమ్మవారు శ్రీమహాలక్ష్మిగా దేవిగా మంగళవారం దర్శనమిచ్చారు. భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు.

మండవల్లిలో..

మండవల్లి: మండవల్లి శ్రీ భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం అమ్మవారు శ్రీ మహాలక్ష్మీదేవిగా దర్శనమిచ్చారు. అర్చకులు భవానీ శంకర్ భక్తులతో పూజలు చేయించారు.



కైకలూరు మండలం ఆటపాకలో..



మండవల్లి మల్లేశ్వర స్వామి ఆలయంలో..



నందివాడలో ధనలక్ష్మీదేవిగా దర్శనమిచ్చిన అమ్మవారు

విద్యుత్ విజిలెన్స్ దాడులు

ముదినేపల్లి రూరల్: ముదినేపల్లి విద్యుత్‌సెక్షన్ పరిధిలోని పలు గ్రామాల్లో విద్యుత్ విజిలెన్స్ అధికారులు మంగళవారం దాడులు నిర్వహించారు. వినియోగదారుల గృహాలు, వాణిజ్య సముదాయాలు, ఆక్వా చెరువులపై మీటర్లను పరిశీలించారు. విజిలెన్స్ ఈఈ సీహెచ్ వాసు, గుడివాడ ఈఈ జీవీ శ్రీనివాసరావు, ముదినేపల్లి ఏఈఈ పూర్ణచంద్రరావు ఆధ్వర్యంలో అధికారులు 42 బృందాలుగా ఏర్పడి తనిఖీలు చేశారు. ఈ తనిఖీల్లో 248 సర్వీసు మీటర్లలో అదనపు లోడు మొత్తానికి రూ.9.68 లక్షలు విద్యుత్ చౌర్యం చేసినందుకు రెండు సర్వీసులకు రూ.10 వేలు జరిమానా విధించారు. గుడివాడ డివిజన్ పరిధిలోని రూరల్ ఏడీఈ పి.కిరణ్‌బాబు, ఇతర ఏడీఈలు, ఏఈలు పాల్గొన్నారు.

సామూహికంగా ఎలుకలను నివారించాలి

గుడ్లవల్లేరు: ఎలుకలను సామూహికంగా నివారించాలని రైతులకు ఏడీఏ బి.స్వర్ణలత పిలుపునిచ్చారు. శేరీ దగ్గుమిల్లిలో మంగళవారం నిర్వహించిన పొలం పిలుస్తోందిలో భాగంగా సామూహిక ఎలుకల నివారణపై అవగాహన కార్యక్రమాన్ని చేపట్టారు. డీఆర్సీ ఏడీఏ జ్యోతి రమణి సమగ్ర పోషక యాజమాన్యం, ఎరువుల యాజమాన్యం, చీడ పీడల యాజమాన్యంపై రైతులకు అవగాహన కలిగించారు. ఏఓ ఎల్.సునీల్ పాల్గొన్నారు.

ఎలుకల నివారణ మందు పంపిణీ

అవురుపూడి(మొవ్వ): 96 గ్రాముల నూకలు, రెండు గ్రాముల ఎలుకల మందు(బ్రోమోడియెలోన్) కలిపిన అనంతరం రెండు గ్రాముల వేరుశనగ నూనెను కలిపి విషపు ఎరలను తయారు చేసి, చిన్న చిన్న పొట్లాలుగా కట్టి పొలాల్లో బొరియల వద్ద ఏర్పాటు చేయాలని ఏఓ కే శివ ప్రసాద్ సూచించారు. మొవ్వ మండలంలోని అవురుపూడిలో మంగళవారం మండల వ్యవసాయాధికారి కంచర్ల శివప్రసాద్ ఎరల ఏర్పాటు వివరించి రైతులకు ఎలుకల మందు పంపిణీ చేశారు.

ఐనంపూడిలో..

ఐనంపూడి(పామర్రు): వరి పొలాల్లో ఎలుకలను రైతులు అందరూ కలిసి సామూహికంగా నివారిస్తే ఫలితం ఉంటుందని పామర్రు ఏడీఏ బి.స్వర్ణలత పేర్కొన్నారు. మండలంలోని ఐనంపూడి, అడ్డాడ గ్రామాల్లో పొలంపిలుస్తోంది కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. కార్యక్రమంలో ఏఓ శివ నాగరాణి పాల్గొన్నారు.

రెవెన్యూ ఉద్యోగుల బదిలీలు

ముదినేపల్లి రూరల్: మండలంలోని పలువురు రెవెన్యూ ఉద్యోగులు బదిలీ కాగా నూతనంగా వచ్చిన వారు బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకు ఆర్ఐగా పనిచేసిన శివకుమార్ బదిలీపై గుడ్లవల్లేరు రెవెన్యూ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా వెళ్లారు. ఈయన స్థానంలో కలిదిండి నుంచి ఎస్.శ్యామ్యూల్ బదిలీపై వచ్చారు. అల్లూరు వీఆర్వో పద్మావతి వడాలికి రాగా, ఇక్కడ పని చేస్తున్న మురళీ పెనుమల్లికి అక్కడి నుంచి వీరవెంకట హనుమంతరావు ముదినేపల్లి–1కు ఇక్కడి నుంచి కరీం గూడూరుకు బదిలీ అయ్యారు. పెదపాలపర్రు నుంచి ఆర్.సుబ్రహ్మణ్యం ముదినేపల్లి–2కు, సింగరాయపాలెం నుంచి వెంకట్రావు పెదగొన్నూరుకు ఇక్కడ పని చేస్తున్న ఏడుకొండలు శ్రీహరిపురానికి బదిలీ అయ్యారు. శ్రీహరిపురం వీఆర్వో బాన సుబ్బయ్య సింగరాయపాలేనికి, వైవాక వీఆర్వో ఫణికుమార్ వాడవల్లికి చిగురుకోట వీఆర్వో కిషోర్ కొరగుంటపాలేనికి బదిలీ కాగా వాడవల్లి వీఆర్వో ఏసుబాబు చిగురుకోటకు వణుదుర్రు వీఆర్వో నరసింహారావు గుడ్లవల్లేరు మండలం విన్నకోటకు, పెయ్యేరు వీఆర్వో కేశవరావు నూజివీడుకు, గురజ వీఆర్వో పవన్ సీతారామపురానికి బదిలీ అయ్యారు.

ప్రత్యేక పూజలు

పామర్రు: స్థానిక ఉంద్రపూడి–పోలవరం అడ్డరోడ్డు వద్ద ఉన్న వీరాంజనేయ స్వామి ఆలయంలో స్వామికి ప్రత్యేకంగా అభిషేకాలు, పూజలను నిర్వహించారు. భక్తులు ఆలయప్రాంగణంలో పాల పొంగళ్లను వండి స్వామికి నివేదనలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ అర్చకులు అగ్రిహోత్రం రామాచార్యులు ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు.

ఘనంగా ఎయిర్ ఫోర్స్ డే

గుడ్లవల్లేరు: గుడ్లవల్లేరులో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఎయిర్ ఫోర్స్ డేను మంగళవారం ఘనంగా నిర్వహించారు. విమానయాన సంస్థలో పని చేసి, ఉద్యోగ విరమణ చేసి స్థానిక స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియాలో మేనేజర్‌గా పని చేస్తున్న బత్తుల వెంకటరమణను సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా లయన్స్ మాజీ గవర్నర్ వై.పి.సి.ప్రసాద్, స్థానిక క్లబ్ చైర్మన్ నిమ్మగడ్డ శశికళ, కార్యదర్శి ఎం.పెరుమాళ్లు తదితరులు పాల్గొన్నారు.

సుబ్బారాయుడికి అభిషేకాలు

ముదినేపల్లి రూరల్: ప్రసిద్ధి చెందిన సింగరాయపాలెం–చేవూరుపాలెం సెంటర్‌లోని శ్రీసుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో స్వామికి మంగళవారం అభిషేకాలు నిర్వహించారు. ఈ అభిషేకాలు చేయించుకునేందుకు జిల్లాలోని నలుమూలల నుంచి భారీ సంఖ్యలో భక్తులు తరలి వచ్చారు. ప్రధాన అర్చకుడు వీరభద్రశర్మ ఆధ్వర్యంలో సుబ్బారాయుడికి ఈ అభిషేకాలు నిర్వహించారు.

దరఖాస్తులకు నేటితో గడువు ముగింపు

కైకలూరు: మద్యం దుకాణాల కేటాయింపులకు బుధవారం సాయంత్రం ఐదు గంటల లోపు దరఖాస్తుల స్వీకరణ గడువు ముగుస్తుందని జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్‌శాఖ డిప్యూటీ కమిషనర్ శ్రీలత తెలిపారు. స్థానిక ఎక్సైజ్ కార్యాలయం వద్ద నిర్వహిస్తున్న దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమాన్ని మంగళవారం పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ కైకలూరు ఎక్సైజ్‌శాఖ పరిధిలో మొత్తం 21 మద్యం దుకాణాలకు గాను సోమవారానికి 63 ఆఫ్‌లైన్ దరఖాస్తులు అందగా, మంగళవారం 75 దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. ఎక్సైజ్ సీఐ రమేష్, ఎస్సై ఆదినారాయణ పాల్గొన్నారు.



సిబ్బందితో మాట్లాడుతున్న డిప్యూటీ కమిషనర్ శ్రీలత